# రక్తంతో రాసిన కథ 'మీర్జాపూర్'.. మూడో సీజన్ వస్తోంది

: మీర్జాపూర్.. భాషలతో సంబంధం లేకుండా ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన వెబ్‌సిరీస్. క్రైమ్ యాక్షన్ జానర్‌లో వచ్చిన ఈ సిరీస్ రెండు సీజన్లు ప్రేక్షకులను ముఖ్యంగా యువతను విశేషంగా అలరించాయి. ఈ సీజన్‌లోని పాత్రలపై వచ్చినన్ని మీమ్స్ మరే వెబ్‌సిరీస్‌పైనా రాలేదంటే అతిశయోక్తి కాదు. ఇందులోని నటీనటులను అసలైన పేర్లకంటే కూడా కాలీన్‌భయ్యా గుడ్డు పండిత్ బబ్లూ పండిత్ ( మున్నా భాయ్ (గోలు ( పేర్లతోనే ఎక్కువ పాపులర్ అయ్యారు. ఆ రెండు




సీజన్లను మించి మూడో సీజన్ ) స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. రక్తంతో రాసిన 'మీర్జాపూర్'.. ఈ కథ ముందుకు సాగాలంటే మళ్లీ రక్తాన్నే కోరుతుంది. జులై 5వ తేదీ నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వేదికగా 'సీజన్3' స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో మీర్జాపూర్: సీజన్-1, సీజన్-2లలో ఏం జరిగిందో ఓసారి గుర్తు చేసుకుందామా?

1: మీర్జాపూర్‌లో అఖండానంద్ అలియాస్ కాలీన్ భాయ్ (పంకజ్ త్రిపాఠి) మాఫియా సామ్రాజ్యానికి కిరీటం లేని మహారాజు. డ్రగ్స్, ఆయుధాలే అతడి ప్రధాన వ్యాపారం. ఒకరోజు రాత్రి పెళ్లి వేడుకలో కాలీన్ భాయ్ కొడుకు మున్నా (దివ్యేందు) తుపాకీ పేల్చడంతో పెళ్లికొడుకు మరణిస్తాడు. దీంతో చనిపోయిన పెళ్లి కొడుకు కుటుంబం నిజాయతీపరుడైన లాయర్ రమాకాంత్ పండిత్ (రాజేశ్ తైలాంగ్)ను కేసు వాదించడానికి నియమించుకుంటుంది. రమాకాంత్‌కు ముగ్గురు పిల్లలు గుడ్డు పండిత్ (అలీ ఫజల్), బబ్లూ పండిత్ (విక్రాంత్ మస్సే), డింపీ (హర్షిత). కాలీన్ భాయ్ కొడుకును కాదని తన వ్యాపార సామ్రాజ్య నిర్వహణను అనూహ్యంగా గుడ్డు, బబ్లూలకు అప్పగిస్తాడు. దీంతో మున్నా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ ఉంటాడు. దీనికి తోడు డింపీ స్నేహితురాలైన స్వీటీని గుడ్డు ప్రేమిస్తాడు.

స్వీటీని ఎలాగైనా దక్కించుకోవాలని కోరికతో మున్నా ఉంటాడు. సమయం చూసుకుని గుడ్డు, అతడి స్నేహితులను చంపాలనుకుంటాడు మున్నా. ఈ క్రమంలో ఓ పెళ్లి వేడుకకు హాజరైన గుడ్డు, గోలు (శ్వేతా త్రిపాఠి), స్వీటీ, బబ్లూ, డింపీలపై తన గ్యాంగ్‌తో కలిసి మున్నా అటాక్ చేస్తాడు. ఈ దాడిలో గర్భిణి అయిన స్వీటీతో పాటు బబ్లూ చనిపోతారు. గుడ్డును కూడా చంపాలని ప్రయత్నించినా గోలుతో కలిసి తప్పించుకుంటాడు. మరోవైపు ప్రజల్లో తన పట్ల ఉన్న భయాన్ని మరింత పెంచడానికి కాలీన్ భాయ్ ఓ పోలీస్ ఆఫీసర్‌ను దారుణం హత్య చేయడం తదితర సన్నివేశాలతో సీజన్-1ను ముగించారు.

బలమైన ఎమోషనల్ డ్రామా సీజన్-2

2: సీజన్-1 పాత్రల పరిచయంతో పాటు మీర్జాపూర్‌ను పూర్తిగా ఎస్టాబ్లిష్ చేశారు దర్శకులు. అదే సమయంలో గన్ ఫైర్స్, ఛేజింగ్‌లు ఓ ఫుల్ యాక్షన్ మూవీని తలపించేలా తీర్చిదిద్దగా, సీజన్-2లో యాక్షన్ మోతాదు తగ్గించి, డ్రామాపై ఎక్కువ దృష్టి పెట్టారు. మీర్జాపూర్‌లోని పాత్రల మధ్య బలమైన ఎమోషన్స్‌తో కూడిన కథను నడిపించారు. మున్నా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరంభమయ్యే సన్నివేశాలతో సీజన్-2 మొదలవుతుంది. మున్నా చేసిన దాడి నుంచి తప్పించుకున్న గోలు, గుడ్డులు ఓ డాక్టర్‌ను కిడ్నాప్ చేసి, చికిత్స పొందుతారు. అంతేకాదు, మున్నా చేసిన దారుణానికి ప్రతీకారం తీర్చుకోవాలని పగతో రగిలిపోతూ ఉంటారు. ఈ క్రమంలో గోలు తుపాకీ షూటింగ్ నేర్చుకుంటుంది.

కాలీన్‌భాయ్‌కు అత్యంత విశ్వాస పాత్రుడు మక్బూల్. ఒకప్పుడు మున్నా కారణంగా తన కుటుంబ సభ్యుడిని కోల్పోవడంతో ఇదే అదనుగా భావించి, కాలీన్ తండ్రిని చంపి వగతీర్చుకోవాలనుకుంటాడు. ఆశ్చర్యకరంగా బీనా (కాలీన్ భార్య) కూడా మక్బూల్‌తో చేతులు కలిపి అతడి తండ్రిని చంపుదామని అంటుంది. దీంతో కాలీన్ సామ్రాజ్యం పునాదులు కదిలిపోయి మీర్జాపూర్‌పై అతడి ఆధిపత్యం పోతుందని భావిస్తుంది. మరోవైపు తన తండ్రి కాలీన్ భాయ్‌ను మోసం చేసేందుకు శరద్ శుక్లాతో చేతులు కలుపుతాడు మున్నా. అదే సమయంలో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం కుమార్తె మాధురి (ఇషా తల్వార్)ని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు.

మీర్జాపూర్ డాన్ సింహాసనాన్ని ఎక్కేందుకు తన తండ్రి కాలీన్ భాయ్‌ను చంపడానికి మున్నా ప్లాన్‌లు వేస్తుండగా, మున్నాపై పగతీర్చుకునేందుకు గుడ్డు, గోలు సిద్ధమవుతారు. అదను చూసి దాడికి దిగడంతో తీవ్రంగా గాయపడిన కాలీన్‌భాయ్‌ను శరద్ కాపాడతాడు. మున్నాను గుడ్డు చంపేసి, తన సోదరుడు బబ్లూ ప్రేయసి స్వీటీ చావులకు ప్రతీకారం తీర్చుకుంటాడు. అంతేకాదు, మీర్జాపూర్ మాఫియా సింహాసనాన్ని అధిరోహిస్తాడు.

సీజన్-3లో ఏం చూపించబోతున్నారు?

3: మీర్జాపూర్ సింహాసనాన్ని దక్కించుకున్న తర్వాత పూర్వాంచల్‌లో ప్రతి దాన్ని శాసించే శక్తిగా ఎదగాలనుకుంటాడు గుడ్డు. ఈ క్రమంలో మీర్జాపూర్‌లో కాలీన్ భాయ్ గుర్తులు లేకుండా చెరిపేసేందుకు ప్రయత్నిస్తాడు. మున్నాభాయ్ మరణంతో మాధురీ యాదవ్ రాజకీయాల్లో అడుగుపెడుతుంది. కాలీన్‌భయ్యాపై సింపథీని క్రియేట్ చేసి, ప్రజలకు చేరువకావాలని భావిస్తుంది. మరోవైపు కాలీన్ వెనక్కి తిరిగి వస్తాడు. 'ఈ సింహాసనం.. వారసత్వం.. నేను, నా తండ్రి కలిసి నిర్మించాం. ఇప్పటివరకూ పూర్వాంచల్‌లో జరగనిది చేయాల్సిన సమయం వచ్చింది' అని కాలీన్ భయ్యా మాటలతో సీజన్-3పై ఆసక్తిని పెంచారు దర్శకులు గుర్మీత్ సింగ్, ఆనంద్ అయ్యర్.


మహేశ్‌బాబు


పృథ్వీరాజ్

# హీరో - విలన్?

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన తదుపరి సినిమా పనుల్ని ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక ప్రక్రియని పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కనున్న ఆ చిత్రంలో ఆయన్ని ఢీ కొట్టే ప్రతినాయక పాత్ర కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఎంపిక దాదాపు ఖాయమైనట్టు సమాచారం. ఇప్పటివరకూ చేసిన చిత్రాలకంటే భారీగా, అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ని రూపొందించాలనే ప్రయత్నాల్లో ఉన్నారు రాజమౌళి. అందుకు తగ్గట్టే నటీనటులు, సాంకేతిక బృందం ఈ ప్రాజెక్ట్‌లో భాగం అవుతున్నారు.

ఈ ఏడాదిలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది. విజయేంద్రప్రసాద్ అందించిన ఈ సినిమా కథపై పలు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. దర్శకుడు రాజమౌళి మాత్రం తన సినిమాల్లోని కథలు, పాత్రలకు సంబంధించిన విషయాల్ని ఎంతో రహస్యంగా ఉంచుతూ... సరైన సందర్భాన్ని చూసుకుని బయట పెడుతుంటారు. ప్రపంచాన్ని చుట్టే ఓ సాహస ప్రయాణం నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతుందనే విషయం మాత్రమే ఇప్పటివరకూ బయటికొచ్చింది.

# 'మహారాజ' దర్శకుడితో నయన్?

నయనతార ప్రస్తుతం తన సినీ కెరీర్‌ను రాకెట్ వేగంతో పరుగులు తీయిస్తోంది. ఇప్పటికే ఆమె చేతిలో అరడజనుకు పైగా సినిమాలున్నాయి. వీటితో పాటు మరికొన్ని భారీ ప్రాజెక్ట్‌ల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. కాగా, ఇప్పుడామె వద్దకు మరో హిట్ దర్శకుడు కథ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇటీవలే 'మహారాజ'తో సినీప్రియుల్ని థ్రిల్ చేశారు దర్శకుడు నిథిలన్ స్వామినాథన్. ఇప్పుడాయన నయన్ కోసం ఓ శక్తిమంతమైన నాయికా ప్రాధాన్య కథను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కథ విషయమై చర్చలు మొదలయ్యాయని.. దీనిపై నయన్ సానుకూలంగా ఉందని సమాచారం అందుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇది వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది. ప్రస్తుతం నయనతార నటించిన 'టెస్ట్' విడుదలకు సిద్ధమవుతుండగా.. 'టాక్సిక్', 'డియర్ స్టూడెంట్' తదితర సినిమాలన్నీ చిత్రీకరణ దశలో ఉన్నాయి.



# ఉరకలేసింది.. కొత్త నీరు

చిత్రసీమకు ఊపిరి.. కొత్తదనం. అది కొత్తతరంతోనే సాధ్యమని నమ్ముతుంది పరిశ్రమ. సినీప్రియులూ దీన్నే బలంగా విశ్వసిస్తారు. మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్లుగా వైవిధ్యభరితమైన కథలతో వినోదాలు వంచివ్వడంలో నవతరం దర్శకులే ముందుంటారు. ప్రయోగాలకు చిరునామాగా నిలిచేదీ ఈ కొత్త నీరే. అందుకే ఓ కొత్త దర్శకుడి సినిమా తెరపైకి వస్తుందంటే చాలు.. ప్రేక్షకుల కళ్లన్నీ ఆ వైపే ఆసక్తిగా చూస్తుంటాయి. గతేడాది తరహాలోనే ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పలువురు కొత్త దర్శకులు బాక్సాఫీస్ ముందు అదృష్టం పరీక్షించుకున్నారు. వారిలో కొందరు తొలి అడుగులోనే హిట్టు కొట్టి అందర్నీ మెప్పించగా.. మరికొందరు విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నారు. మరి ఈ ఎనిమిది నెలల కాలంలో తెరపై మెరిసిన ఆ కొత్త కెప్టెన్లు ఎవరు?

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు తెలుగు చిత్రసీమకు దక్కిన విజయాల్లో చిన్న, మీడియం బడ్జెట్ సినిమాల వాటానే ఎక్కువ. వాటిలో సింహభాగం తొలిసారి కెప్టెన్ కుర్చీలో కూర్చున్న వాళ్లు రూపొందించినవే ఉండటం విశేషం. ఈ ఏడాది ఈ కొత్త కెప్టెన్ల జోరు సంక్రాంతి నుంచే మొదలైంది. నాగార్జున నటించిన 'నా సామిరంగ'తో దర్శకుడిగా తెరకు పరిచయమయ్యారు నృత్యదర్శకుడు విజయ్ బిన్నీ. స్నేహం, ప్రేమ, పగ అంశాల మేళవింపుతో.. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ డ్రామాగా విజయ్ ఈ చిత్రాన్ని మలిచిన తీరు సినీ ప్రియుల్ని మెప్పించింది. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ.. వైవిధ్యభరితమైన కథలతో అలరిస్తూ హీరోగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఫిబ్రవరిలో ఆయన నుంచి వచ్చిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మంచి వసూళ్లతో సత్తా చాటడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ఈ చిత్రంతోనే దర్శకుడిగా పరిచయమయ్యారు దుశ్యంత్ కటికనేని.

మార్చిలో బాక్సాఫీస్ బరిలో నిలిచి.. అనూహ్య విజయాన్ని అందుకున్న సినిమాల్లో విష్వక్ సేన్ 'గామి' ఒకటి. ఏళ్ల పాటు సెట్స్‌పై నలిగిన ఈ సినిమా.. భిన్నమైన అడ్వెంచరస్ థ్రిల్లర్ కథతో తెరపై ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించింది. ముఖ్యంగా ఈ చిత్ర విషయంలో కొత్త దర్శకుడు విద్యాధర్ స్క్రీన్‌ప్లే ప్రతిభ విమర్శకుల్ని మెప్పించింది. ఫేస్ బ్లైండ్‌నెస్ అనే విభిన్నమైన కథాంశంతో కొత్త దర్శకుడు అర్జున్ వై.కె తెరకెక్కించిన సినిమా 'ప్రసన్న వదనం'. సుహాస్ హీరోగా నటించిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ బాక్సాఫీస్ ముందు మంచి వసూళ్లతో సత్తా చాటింది. ఇక ఇదే వారంలో విడుదలైన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'ఆరంభం' సినీప్రియులకు ఓ కొత్త అనుభూతిని అందించిన చిత్రంగా పేరు దక్కించుకుంది. దీనితోనే అజయ్ నాగ్ దర్శకుడిగా తెలుగు తెరకు పరిచయమయ్యారు.

ద్వితీయార్ధంలో పెరిగిన విజయాలు

ఈ ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్ధంలో తెలుగు తెరపై కొత్త కెప్టెన్ల మెరుపులు రెట్టింపయ్యాయి. నటుడు అజయ్ ఘోష్‌ను హీరోగా పరిచయం చేస్తూ కొత్త దర్శకుడు శివ పాలడుగు తెరకెక్కించిన సినిమా 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఇది జూన్ రెండో వారంలో బాక్సాఫీస్ ముందుకొచ్చింది. ఈ చిత్రం ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసల్ని దక్కించుకుంది. ఇక ఆగస్టు బరిలో పెద్ద చిత్రాల సందడి గట్టిగా కనిపించినప్పటికీ.. చిన్న చిత్రాలే ఎక్కువగా తళుక్కుమన్నాయి. 90ల నాటి స్నేహాలు.. కోనసీమలోని జాతర సందడిని చూపిస్తూ.. 'కమిటీ కుర్రోళ్ళు'తో తెరపై అదృష్టాన్ని పరీక్షించుకున్నారు కొత్త దర్శకుడు యదు వంశీ.


కొత్త ప్రతిభను పరిచయం చేస్తూ.. నిర్మాతగా నిహారిక కొణిదెల చేసిన ఈ తొలి ప్రయత్నం ప్రేక్షకుల్ని చక్కగానే ఆకట్టుకుంది. ఇక గత వారం పెద్ద చిత్రాలతో పోటీ పడుతూ.. 'ఆయ్' అంటూ సినీప్రియుల్ని పలకరించారు హీరో నార్నె నితిన్. ఈ చిత్రంతోనే దర్శకుడిగా పరిచయమయ్యారు అంజి కె.మణిపుత్ర. స్నేహాన్ని.. ప్రేమను మిళితం చేసి.. అమలాపురం నేపథ్యంలో సాగే ఆహ్లాదభరితమైన కథాంశంతో అంజి ఈ చిత్రాన్ని మలిచిన తీరు కుర్రకారును బాగా ఆకట్టుకుంది.

ఓటీటీ వేదికగా సత్తా చాటారు..

ఈ ఏడాది వెండితెరకు దీటుగా ఓటీటీ వేదికగా అందరి దృష్టినీ ఆకర్షించిన కొత్త దర్శకులు కొందరున్నారు. వీరి జోరు జనవరి ఆరంభం నుంచే మొదలైంది. ఈటీవీ విన్ వేదికగా విడుదలైన 'చ90%ం%' వెబ్‌సిరీస్‌తో దర్శకుడిగా తొలి అడుగులోనే అందరి దృష్టినీ ఆకర్షించారు ఆదిత్య హాసన్. శివాజీ, వాసుకి ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ ఇది.

# టాక్సిక్ కోసం 1950 కాలంలోకి

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్.. అన్నది ఉపశీర్షిక. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కియారా కథానాయికగా నటిస్తుండగా.. నయనతార, హుమా ఖురేషీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు తెలిసింది. ఇది డ్రగ్ మాఫియా కథాంశంతో తెరకెక్కనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. అయితే ఇప్పుడు దీని నేపథ్యం గురించి మరో ఆసక్తికర అంశం బయటకొచ్చింది. ఈ సినిమా 1950 - 1970ల మధ్య కాలంలో జరిగే కథగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం బెంగళూరు శివార్లలో అప్పటి వాతావరణాన్ని తలపించేలా కొన్ని సెట్లు నిర్మించినట్లు తెలిసింది. అందులోనే ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారట. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ లండన్‌లో జరగనుంది. దీనికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.


యశ్

# సన్నద్ధమవుతున్న మోక్షజ్ఞ

నందమూరి కుటుంబం నుంచి మరో వారసుడి తెర ప్రవేశం ఖాయమైనట్టే. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఈ ఏడాదే కెమెరా ముందుకొస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ సినిమా వేడుకలో ఆ సంకేతాలిచ్చారు బాలకృష్ణ. ప్రస్తుతం మోక్షజ్ఞ అందుకు సంబంధించిన సన్నాహాల్లోనే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా ఆయన ఓ ఫొటోషూట్‌లో పాల్గొనగా, అందులోని కొన్ని లుక్స్ బయటికొచ్చాయి. అప్పటినుంచి సామాజిక మాధ్యమాల్లో మోక్షజ్ఞ తెర ప్రవేశంపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. పలువురు యువ దర్శకులు ఆయన కోసం కథలు సిద్ధం చేసినట్టు సమాచారం. అందులో 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరి బాలకృష్ణ ఎవరి కథకు పచ్చజెండా ఊపుతారు? మోక్షజ్ఞ ఎవరి దర్శకత్వంలో తెరకు పరిచయం అవుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.


మోక్షజ్ఞ

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy